క్లుప్తంగా

కాంట్రాక్ట్ కార్మికులకు రక్షణ సామగ్రి అందజేత



రక్షణ సామగ్రి అందిస్తున్న వెంకన్న

రామగిరి: సింగరేణి సంస్థ ఏపీఏ పరిధి అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్‌లో బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్టర్ కార్మికులకు శనివారం సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న రక్షణ పరికరాలను అందజేశారు. కాంట్రాక్టర్ ముల్మారి శ్రీనివాస్ బెల్ట్ క్లీనింగ్ కార్మికుల కోసం కొనుగోలు చేసిన బూట్లు, రేడియం జాకెట్స్, చేతి తొడుగుల(గ్లౌజ్‌లు)ను కార్మికులకు అందజేశారు. కార్యక్రమంలో సంతోష్, శ్రీనివాస్, ధర్మన్న, బెల్ట్ క్లీనింగ్ కార్మికులు పాల్గొన్నారు.

రాజయోగి ఆశ్రమంలో గురుపూజోత్సవం



జూలపల్లి ఆశ్రమంలో గురుపూజోత్సవం

జూలపల్లి: మండల కేంద్రంలోని ఆధ్యాత్మిక శ్రీ మదలర్షి రాజ యోగీశ్వర సంక్షేమాశ్రమమ్ నిజ దేశి కేంద్ర ప్రబోధ గురు పీఠం ఆశ్రమంలో శనివారం గురుపూజోత్సవాన్ని నిత్యానంద శ్రీ కన్నం సత్యనారాయణ నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ చేతుల మీదుగా 'అచలర్షి సత్యానంద' ఆధ్యాత్మిక, సామాజిక త్రైమాసిక పత్రికను ఆవిష్కరించారు. అనంతరం భక్తులు భజనలు,గురు కీర్తనలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటయ్య, నల్ల ఫౌండేషన్ అధ్యక్షుడు నల్ల మనోహర్‌రెడ్డి, ఉపసర్పంచ్ మహేశ్, భక్తులు హాజరయ్యారు.

కాన్షీరాం విగ్రహావిష్కరణకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక ఇస్తున్న సురేందర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని జెండా కూడలి సమీపంలో ఏర్పాటు చేసిన కాన్షీరాం విగ్రహావిష్కరణ మార్చి 4న నిర్వహిస్తున్నామని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి సురేందర్ సన్నీ తెలిపారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని శనివారం క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వానపత్రికను అందించి కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. మార్చి 4న కాన్షీరాం కుటుంబీకులు విగ్రహావిష్కరణకు హాజరవుతున్నారని సురేందర్ పేర్కొన్నారు.

ఏపీఏ జీఎంకు సన్మానం



జీఎంను సన్మానిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

రామగిరి: సింగరేణి సంస్థ ఆర్జీ3, ఏపీఏ ఏరియాలోని ఎస్అండ్‌పీసీ కార్యాలయంలోని శ్రీత్రయంబకేశ్వర ఆలయంలో, మండలంలోని కల్వచర్ల శ్రీఉమామహేశ్వర ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు వచ్చిన సింగరేణి సంస్థ ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లును శనివారం ఆలయాల కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంట పద్మ, ఆలయ కమిటీ చైర్మన్ కొలిపాక సత్తయ్య, గౌరవ అధ్యక్షుడు ఇసంపెల్లి రమేశ్, సభ్యులుపాల్గొన్నారు.

విగ్రహదాతకు..



విగ్రహదాతను సన్మానిస్తున్న నాయకులు

జ్యోతినగర్: అభయాంజనేయ స్వామి ఆలయంలో శివ పంచాయతన విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా శివలింగం, నంది, సూర్యుడు, విష్ణువు యొక్క విగ్రహాలను అందించిన సుందిల్ల కృష్ణను బీజేపీ నాయకుడు సతీశ్‌కుమార్, పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంపల్లి రవి, భరత్, శ్రీకాంత్, లైశెట్టి సతీష్, కృష్ణ, శ్రీధర్, రాజేష్, అశోక్, లక్ష్మణ్, మునిపట్ల శశి, మహేందర్, శంకర్, భక్తులు పాల్గొన్నారు.



యైటింక్లయిన్ కాలనీ: మంగళసూత్రం చూపిస్తున్న పండితులు

శంభో శంకరా..

మహా శివరాత్రి వేడుకలు జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా జరిగాయి. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని పలు ఆలయాలు, రామగుండం, మంథని నియోజకవర్గ కేంద్రాల్లో, గోదావరిఖని, సుల్తానాబాద్ పట్టణాల్లో, పాలకుర్తిలో బుగ్గ రామలింగేశ్వర క్షేత్రంలో. అన్ని మండల కేంద్రాలు, అన్ని గ్రామాల్లోని శివాలయాల్లో వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయాలన్నీ శివనామ స్మరణతో హోరెత్తాయి. వేద పండితులు ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం కనుల విందుగా జరిపించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ధర్మారం మండలంలోని పలు ఆలయాల్లో రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక పూజలు చేశారు. రామగుండంలోని పలు ఆలయాల్లో ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మంథనిలో ఎమ్మెల్యే శ్రీధర్ బాబు, పెద్దపల్లిలోని పలు ఆలయాలు, ఓదెలలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, రామగుండంలో మేయర్ అనిల్ కుమార్, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు చేశారు. ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో జిల్లా జడ్జి నాగరాజు, జిల్లాడీసీపీ వైభవ్‌గైక్వాడ్ దంపతులు, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ దంపతులు పూజలు చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని శివాలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు. భక్తులతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. భక్తులు రాత్రి పూట జాగారం చేసి భక్తి శ్రద్ధలతో శివరాత్రి జరుపుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్





జనగామ త్రిలింగేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, వెంకట్రావ్, మేయర్



ధర్మారం: రచ్చపల్లిలో లక్ష్మణ్‌కుమార్ పూజలు



భక్తులతో రద్దీగా గౌతమీనగర్ శివాలయం



పాలకుర్తి: బుగ్గ రామలింగేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ



గోదావరిఖని టౌన్: కాశీ విశ్వేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ



ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందిస్తున్న అర్చకులు



కాల్వశ్రీరాంపూర్‌లో గోవిందాంబ కల్యాణం



సుల్తానాబాద్‌రూరల్: స్వామివారి కల్యాణం



మంథనిలో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు పూజలు



జూలపల్లి: రాజరాజేశ్వర ఆలయంలో కల్యాణం



పెద్దపల్లి మడ్ల రామలింగేశ్వరస్వామి ఆలయంలో విజయరమణారావు పూజలు



సుల్తానాబాద్ శివాలయంలో స్వామివారి కల్యాణం



ఎలిగేడు: స్వామివారి కల్యాణానికి హాజరైన భక్తులు



రామగుండం: గోదావరి ఒడ్డున భక్తుల పుణ్య స్నానాలు

ఇసుక రవాణాను ఆపివేయాలి



మాట్లాడుతున్న విజయరమణరావు

ఓదెల: మానేరు ఇసుక రవాణాను వెంటనే ఆపివేయాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. శనివారం మహాశివరాత్రి సందర్భంగా ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు చేసి మాట్లాడారు. ప్రభుత్వం యథేచ్ఛగా మానేరులోని ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుందన్నారు. దీంతో మానేరు పరివాహక ప్రాంతంలో వ్యవసాయ బావులలో భూగర్భ జలాలు తగ్గి పంటలు ఎండిపోతున్నాయన్నారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిదుల అండదండలతోనే ఇసుకరవాణ రాత్రిపగలు తేడాలేకుండా తరలిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్ రెడ్డి, డైరెక్టర్ ఆళ్ల సుమన్‌రెడ్డి మాజీ సర్పంచులు పుప్పాల శంకర్, రాజు, నాయకులు పాల్గొన్నారు.

పెద్దంపేటలో న్యూడెమోక్రసీ నాయకుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న న్యూడెమోక్రసీ నాయకులు

రామగుండం: భారతదేశ కమ్యూనిస్టు విప్లవ ఉద్యమంలో విప్లవోద్యమ నాయకుడు కామ్రేడ్ సత్యనారాయణసింగ్ శత జయంతి వేడుకలను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి కోడిపుంజుల రాజయ్య కోరారు. ఈ మేరకు శనివారం అంతర్గాం మండల పెద్దంపేటలో ర్యాలీ నిర్వహించారు. ఈనెల 20వ తేదీన సత్యనారాయణసింగ్ శతజయంతి వేడుకలను హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించేందుకు కేంద్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. 1923 జనవరి 30న బీహార్‌లో దామార్ అనే మారుమూల గ్రామంలో జన్మించి మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచన విధానాన్ని విప్లవ ఉద్యమానికి అన్వయించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఆయన సేవలు గొప్పవని కొనియాడారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఐ.కృష్ణ, ఈ.నరేష్, చిలుక శంకర్, సీహెచ్.అబేద్నొగో, మల్యాల దుర్గయ్య, మేర్గు చంద్రయ్య, కోడిపుంజుల జ్యోతి, సదానందం, కోంద్ర మొగిలి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శంకరదాసమయ్య ఉత్సవం



ప్రదర్శనగా బయల్దేరిన మేరు సంఘం నాయకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలో శనివారం మేరుసంఘం ఆధ్వర్యంలో శంకరదాసమయ్య ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా మహాశివరాత్రి రోజున శంకరదాసమయ్య ఉత్సవాన్ని జరుపుకుంటున్నారు. పట్టణంలోని ముత్యాల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన తర్వాత మేళ తాళాలతో ప్రదర్శనగా పట్టణంలోని ఆలయాన్నింటిలో పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని దేవుళ్లను వేడుకున్నామని మేరుసంఘ జిల్లా అధ్యక్షుడు రామగిరి చంద్రమౌళి, నాయకులు వెంకన్న, శీలంబాబు తదితరులు పేర్కొన్నారు.

ఐఎన్‌టీయూసీ ఆర్జీ-1 ఉపాధ్యక్షుడిగా సదానందం



సదానందం

గోదావరిఖని: ఆర్జీ-1 ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడిగా కచ్చకాయల సదానందంను నియమించారు. కేంద్ర ప్రధాన కార్యదర్శిగా వంగ లక్ష్మిపతిగౌడ్, సంయుక్త ప్రధాన కార్యదర్శిగా ఆరేపల్లి శ్రీనివాస్‌ను నియమించారు. ఈమేరకు నియామక ఉత్తర్వులను జనక్‌ప్రసాద్ శనివారం అందజేశారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

రామగిరి: మండలంలోని పన్నూరులో సింగరేణి ఆధ్వర్యంలో నేడు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచ్ అల్లం పద్మ తెలిపారు. గ్రామ సమీపంలోని ఎంవీటీసీ(ప్రాజెక్ట్ అధికారి) కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వైద్య శిబిరంలో కంటి, ఎముకలు,,గుండె, దంత, చాతి, చెవి, ముక్కు, గొంతు వైద్య, స్త్రీ వైద్య,జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్లు అందుబాటులో ఉండి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారని పేర్కొనారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైర్ చోరీ



రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, విసంపేట గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్ చోరీ చేసినట్లు అంతర్గాం మండల ట్రాన్స్‌కో ఏఈ ఏ.శంకర్ తెలిపారు. ఇప్పటికే ఎన్నోసార్లు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి కాపర్ వైర్ చోరీ చేశారన్నారు. దీనిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి నిందితులపై చర్యలు చేపట్టాలని ఏఈ కోరారు.

రాష్ట్రస్థాయి చదరంగంలో ప్రతిభ



మెడల్ అందుకుంటున్న వినీల

ఎలిగేడు: హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియం ఇండోర్‌హాల్లో జరిగిన రాష్ట్రస్థాయి మహిళల చదరంగం పోటీల్లో ఎలిగేడు మండలకేంద్రానికి చెందిన తాటిపల్లి వినీల అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయులుగౌడ్ చేతులమీదుగా వినీలకు మెడల్, సర్టిఫికెట్ అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చదరంగం అసోసియేషన్ అధ్యక్షుడు కేఎస్.ప్రసాద్ ఉన్నారు.

ఘనంగా మహాశివరాత్రి జాగరణోత్సవ్



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్, ఏసీపీ గిరిప్రసాద్

గోదావరిఖని: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రధాన చౌరస్తాలో శివరాత్రి జాగరణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో నిర్వహించిన కార్యక్రమాన్ని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎట్టకేలకు మరమ్మతులు..!

సాక్షి స్పందన



మరమ్మతులు చేపట్టిన బల్దియా సిబ్బంది

కోల్‌సిటీ: గోదావరిఖనిలో నిత్యం రద్దీగా ఉండే మేదరిబస్తీ టర్నింగ్‌లో భారీ గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్‌కు, సాక్షి కథనంతో ఎట్టకేలకు నగరపాలక సంస్థ అధికారులు మరమ్మతులు చేపడుతున్నారు. మేదరిబస్తీ కూడలిలోని మ్యాన్‌హోల్‌పై నుంచి ఓ ట్రాన్స్‌పోర్టు వాహనం వెళ్లడంతో మ్యాన్‌హోల్, రోడ్డు పగిలిపోయి భారీ గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకుపోవడానికి గత ఏడాది డిసెంబర్ 31న నాసిరకం పనులు.. పగులుతున్న రోడ్డు..!' అనే శీర్షికతో 'సాక్షి' ప్రచురించింది. స్పందించిన నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు, 42వ డివిజన్ కార్పొరేటర్ బాలరాజ్‌కుమార్ మ్యాన్‌హోల్ మరమ్మతులు చేయించడానికి ముందుకు వచ్చారు.

కాలువ భూముల కబ్జాదారులపై చర్యలేవీ..?

రామగిరి: మండలంలోని ఎస్సారెస్పీ డీ– 83 కాలువ అనుబంధ 3 ఎల్, 4ఎల్ ఉపకాలువల భూముల కబ్జాదారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కండె పోశం ఎస్సార్ఎస్పీ 3ఎల్, 4ఎల్ కాలువల భూములు కబ్జాకు గురైనాయని సంబంధిత అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సంబధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి 3ఎల్‌కు చెందిన భూమిలో 23 మంది సుమారు 197 పీట్లు, 4 ఎల్‌కు చెందిన భూమిలో 9 మంది సుమారు 66 ఫీట్ల భూమి అక్రమంగా ఆక్రమించుకున్నారని గుర్తించి జిల్లా కలెక్టర్ సంగీత సత్యనారాయణకు జనవరి 25న నివేదిక సమర్పించారు. అయితే నివేదిక సమర్పించి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కాలువ భూముల కబ్జాదారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనంగా నిలుస్తోంది. కబ్జాదారులపై చర్యలు తీసుకోకపోతే మరిన్ని భూములు కనుమరుగైయ్యే అవకాశం లేకపోలేదు.